పేదలకు నాణ్యమైన వైద్యమే సీఎం లక్ష్యం

- ఎంపీపీ వెంకటేశ్వరరావు
- జి.అగ్రహారం, పెదపట్నంలంకల్లో జగనన్న ఆరోగ్య సురక్ష



జి.అగ్రహారంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి



పెదపట్నంలంకలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనూష

అంబాజీపేట: నిరుపేదలందరికీ నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందించే లక్ష్యంతో సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. వైద్యాధికారిణి వి.గౌతమి పర్యవేక్షణలో గంగలకుర్రు అగ్రహారంలో జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ దొంగ నాగేశ్వరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష మెగా మెడికల్ క్యాంపును ప్రతి రోగి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. అనంతరం శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విత్తనాల శేఖర్, రాయుడు చంటి, బందన రాంబాబు, రాయుడు షణ్ముఖ్, మట్టపర్తి యజ్ఞశ్రీ, రాయుడు కృష్ణమహేష్ తదితరులు పాల్గొన్నారు.

పెదపట్నంలంకలో 300 మందికి..

మామిడికుదురు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము పేర్కొన్నారు. పెదపట్నంలంక ప్రధాన ప్రాథమిక పాఠశాల వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. నగరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.స్వర్ణలత ఆధ్వర్యంలో ఆఫ్తాలమిక్ అలీ హుస్సేన్, చిన్న పిల్లల డాక్టర్లు అనూష, సుమంత్ సుమారు 300 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. శిబిరంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు రాము మాట్లాడుతూ సీఎం జగన్ పేదల ఆరోగ్యంపై ఎంతో శ్రద్ధ చూపుతున్నారన్నారు. సర్పంచ్ సుందరనీడి చిన్ని, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, అప్పనపల్లి దేవస్థానం ట్రస్టీ కొమ్ముల సూరిబాబు, మాజీ ఎంపీటీసీ జోగి వెంకటరామకృష్ణ, సచివాలయ కన్వీనర్లు బందారు బాబులు, లంకే దుర్గ, బొరుసు రాంబాబు, కొమ్ముల బుజ్జి, యేడిద శేఖర్ పాల్గొన్నారు.

శిశువుల చికిత్సకు ఎస్టీయూ ఆర్థిక సాయం



అమలాపురంలో శివరాన్‌కు సాయం చేస్తున్న ఎస్టీయూ నాయకులు

సఖినేటిపల్లి: సహచర ఉపాధ్యాయుడి దంపతులకు ప్రీ డెలివరీలో జన్మించిన ముగ్గురు శిశువులకు ఇంక్యుబేటర్ చికిత్స ఖర్చులకై మండల ఎస్టీయూ సంఘం మంగళవారం ఆర్థిక సాయం చేసింది. మలికిపురం మండలం బట్టేలంక ఉన్నత పాఠశాలలో స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జి.శివరాన్ దంపతులకు ఇటీవల ప్రీ డెలివరీలో ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు జన్మించారు. అయితే వీరి ఆరోగ్య రీత్యా చికిత్సకై అమలాపురం ఓ ఆసుపత్రిలో ఇంక్యుబేటర్‌లో ఉంచారు. దీంతో తలెత్తిన ఆర్థిక అవసరాలు తెలుసుకున్న ఎస్టీయూ సంఘ ఉపాధ్యాయులు వాట్సాప్ ద్వారా సమాచారం ఇచ్చి, పుచ్చుకుని రెండు రోజుల్లో రూ.35,000 సేకరించారు. ఈ మేరకు ఈ మొత్తాన్ని అమలాపురంలో ఆసుపత్రి వద్ద జిల్లా సంఘ నేతలతో కలసి శివరాన్‌కు అందించారు. సంఘ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శి ఉండపల్లి గిరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

శరవేగంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ రెడ్డి చంటి తదితరులు

కొత్తపేట: గ్రామాల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 2 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభించింది. నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కృషి మేరకు 343.98 ఎకరాలు భూమి సేకరించి, 17,190 మందికి పట్టాలుగా ఇవ్వడం జరిగింది. ఆయా స్థలాలను మెరకచేసి, లే అవుట్‌లు వేసి లబ్ధిదారులకు స్వాధీనం కూడా చేశారు. వాటిని మహిళా లబ్ధిదారుల పేరున గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. దానిలో భాగంగా కొత్తపేట మండలంలో 10 గ్రామాలు కాగా మందపల్లి, వాడపాలెం గ్రామాల్లో స్థలాలు లేక మిగిలిన 8 గ్రామాల్లో సుమారు 105 ఎకరాలు భూమి సేకరించి సుమారు 3,500 మందికి పట్టాలుగా ఇచ్చారు. ఏ గ్రామానికి సంబంధించిన పట్టాదారులకు ఆ గ్రామ సచివాయంలో రిజిస్ట్రేషన్ కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల్లో జరుగుతు న్న రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారు.

జీవశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ లీలావతి

కొత్తపేట: సర్వశిక్ష అభియాన్ ద్వారా జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ఐసీటీ, సిమ్యులేషన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, పి.గన్నవరం మండలాలకు చెందిన 83 మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ హరిప్రసాద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న ఐఎఫ్‌బీ ప్యానల్స్ ఉపయోగించుకుని జీవశాస్త్రంలోని వివిధ అంశాలను అవగాహన చేసుకుని నైపుణ్యాలను పొందవచ్చన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతపై జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంఈఓ-2 కె.లీలావతి, రావులపాలెం ఎంఈఓ బి.శ్రీనివాసరాజు, స్థానిక హైస్కూల్ హెచ్ ఎం ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలను రైతులకు చేరవేయడమే లక్ష్యం



రైతులకు బదనికలను అందిస్తున్న డైరెక్టర్ అండ్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సుశీల్

అంబాజీపేట: జీవనియంత్రణ ప్రయోగాలను, పరిశోధనలను రైతులకు చేరవేసి ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యమని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ అఖిల భారత జీవనియంత్రణ సమన్వయ పథకం డైరెక్టర్ అండ్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎన్.సుశీల్ అన్నారు. అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సుశీల్ మాట్లాడుతూ ప్రయోగశాలలో చేపట్టిన పరిశోధనలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. జీవనియంత్రణ పద్ధతులను, వాటి ఉపయోగాలను రైతులకు వివరిస్తున్నామన్నారు. శాస్త్రవేత్తలు సూచనల మేరకు జీవనియంత్రణ, బదనికలను ఉపయోగించడం వల్ల ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించవచ్చని రైతులకు వివరించారు. కీటక విభాగంలో జరుగుతున్న పరిశోధనా ప్రగతిని, బదనికల ప్రయోగశాలను పరిశీలించారు. ప్రయోగశాలలో జరుగుతున్న ప్రగతిని పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు వివరించారు. అనంతరం స్థానిక పరిశోధన కేంద్రంలో ఉత్పత్తి చేస్తున్న బదనికలు, జీవనియంత్రణ శిలీంధ్ర నాశినిలను సుశీల్ చేతుల మీదుగా రైతులకు అందజేశారు. నోడల్ అధికారి డా.జి.శివకుమార్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.శ్రీదేవి, కొవ్వూరు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ జి.రామానందం లు క్షేత్రస్థాయిలోను, ల్యాబ్‌లో జరుగుతున్న పరిశోధనలు, బదనికలను పరిశీలించారు. కార్యక్రమంలో తెగుళ్ల విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు, తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త బి.నీరజ, కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వి.అనూష, ఉద్యాన విభాగం శాస్త్రవేత్త ఎ.కిరీటి, రైతులు పాల్గొన్నారు.

రైతులు నుంచే మొదలుకావాలి

'వ్యవసాయ.. ఉద్యాన పరిశోధనా స్థానాలు.. ప్రభుత్వ.. ప్రైవేట్ ప్రయోగశాలలోనే కాదు.. రైతుల వద్ద నుంచే వ్యవసాయ, ఉద్యాన పరిశోధనాలు.. ప్రయోగాలు జరగాల్సి ఉంది' అని అఖిల భారత జీవనియంత్రణ సమన్వయ పథకం (ఏఐసీఆర్‌పీ ఆన్ బయోలాజికల్ కంట్రోల్) డైరెక్టర్ అండ్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఏ సుశీల్ అన్నారు. అంబాజీపేటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానాన్ని పరిశీలించేందుకు మంగళవారం వచ్చిన ఆయనను స్థానిక గోదావరి ఇంటిగ్రేటెడ్ ఫార్మర్స్ ట్రేడింగ్ అండ్ ప్రొడ్యూసర్ కంపెనీ (గిఫ్ట్) కంపెనీ చైర్మన్, ఏపీ వాటర్స్ యూజర్స్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథ్‌రెడ్డి, కంపెనీ డైరెక్టర్, వైఎస్సార్ యూనివర్శిటీ పాలక మండలి సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావులు మర్యాదపూర్వకంగా కలిశారు. గిఫ్ట్ కంపెనీ అంబాజీపేటలో ఏర్పాటు చేసిన బయోలాజికల్ ల్యాబ్, రూగోస్ వైట్ ఫ్లై (తెల్లదోమ) నివారణకు అక్కడ ఉత్పత్తి అవుతున్న అపెర్టోక్రైసా ఆస్టర్ బదినికల గురించి వివరించారు. కొబ్బరి, ఇతర ఉద్యాన పంటలను ఆశించే పురుగులు, తెగుళ్లను నివారించే బదనికలను కూడా గిఫ్ట్ కంపెనీ ఉత్పత్తి చేయాలని సుశీల్ కోరారు.

విధి నిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలి



బదిలీపై వెళ్తున్న రాజోలు తహసీల్దార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాపాక



నాతి బుజ్జిని సన్మానించి సత్కరిస్తున్న దృశ్యం

రాజోలు: విధి నిర్వహణలో ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం రాజోలు నుంచి బదిలీపై పశ్చిమగోదావరి జిల్లా తణుకు బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావుకు ఘనంగా పౌర సన్మానం జరిగింది. సర్పంచ్ రేవు జ్యోతి అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ముఖ్యఅతిథిగా పాల్గొని తహసీల్దార్ ముక్తేశ్వరరావు దంపతులను గజమాల, పూలకిరీటంతో సత్కరించారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు ఇళ్ల పట్టాలు పంపిణీలో భూసేకరణలో తహసీల్దార్ ముక్తేశ్వరరావు కీలకభూమికగా వ్యవహరించారన్నారు. నియోజకవర్గంలో రాజోలు మండలంలోనే అత్యధికంగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామన్నారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ మట్టా శైలజ, ఎంపీపీ కేతా శ్రీనివాస్, నాయకులు తెన్నేటి కిషోర్, చెల్లుబోయిన రాంబాబు, బోనం రమేష్‌లతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తహసీల్దార్‌ను ఘనంగా సత్కరించారు.

ఎంపీడీఓ నాతిబుజ్జి సేవలు భేష్

ఆత్రేయపురం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి(ఎంపీడీవో)గా మండల గ్రామాల్లో విశేష సేవలు అందించిన ఎంపీడీఓ నాతిబుజ్జి సేవలు భేష్ అని ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు అన్నారు. ఆత్రేయపురం మండలం నుంచి చాగల్లు బదిలీ అయిన ఆమెకు మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన సచివాలయ సిబ్బంది, ఐసీడీఎస్, ఉపాధిహామీ, పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యాశాఖ తదితర శాఖలకు చెందిన సిబ్బంది తదితరులు ఆమె సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నాతిబుజ్జి మాట్లాడుతూ తనకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీకన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, వైస్ ఎంపీపీ పెన్మెత్స బంగార్రాజు, సర్పంచ్‌లు గాదిరాజు రామకృష్ణంరాజు, వేముల శ్రీనివాస్, మెర్ల రాము, మండల పరిషత్ పర్యవేక్షకులు సురేంద్రరెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాస్, ఎంఈఓ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలి

పి.గన్నవరం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా ఈనెల 9న మండలంలో ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరితో ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని ఎంపీడీఓ ఎం.త్రిశూలపాణి తల్లిదండ్రులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారిణి షేక్ జాసిమ్ అధ్యక్షతన మంగళవారం వివిధ శాఖల అధికారులతో జరిగిన సమన్వయ సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. మండలంలో 11,984 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకూ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. మాత్రలు మింగిన తర్వాత ఎటువంటి ఇబ్బంది ఎదురైనా నాగుల్లంక పీహెచ్‌సీ, పి.గన్నవరం సీహెచ్‌సీలకు తీసుకురావాలని వివరించారు. ఐసీడీఎస్ సీడీపీఓ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల పెంపునకు కృషి చేయాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను అధిగమించడంతో పాటు పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంపునకు ప్రత్యేక కృషి చేయాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి అన్నారు. ఆయా గ్రామాల పీహెచ్‌సీల్లో మంగళవారం వైద్యారోగ్య, ఆశ సిబ్బందికి సమావేశం జరిగింది. ఆగస్టు నెలలో సాధించవలసిన ప్రగతిని అధికారులు వివరించారు. గ్రామ సచివాలయాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను వివరించి ఆరోగ్య సేవలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలామణి పాల్గొన్నారు.

చల్లా సేవలు అభినందనీయం



ఆలమూరులో చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రభాకరరావు కుటుంబసభ్యులు

ఆలమూరు: పేద వర్గాల అభ్యున్నతి కోసం వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు చేపడుతున్న సేవా సామాజిక కార్యక్రమాలు అభినందనీయమని రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు అన్నారు. ఆలమూరులో మంగళవారం రాత్రి వైఎస్సార్ సీపీ నేత ప్రభాకరరావు తన 60వ జన్మదినాన్ని పురస్కరించుకుని సుమారు రూ.రెండు లక్షల విలువైన చీరలు, దుప్పట్లు, దోవతులను పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు 500 మంది పేదలకు పంపిణీ చేసి తన ఉదారతను చాటుకున్నారు. అనంతరం పార్టీ నేతలు, గ్రామస్తుల సమక్షంలో కేక్ కట్‌చేసి జన్మదిన వేడుకలను జరుపుకొన్నారు. వేదనిధి బ్యాంకు చైర్మన్ జి.వివేకానందస్వామి, సలాది రామకృష్ణ, దియ్యన పెద కాపు, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, ఉప సర్పంచ్ చల్లా సీతా మహాలక్ష్మి, చల్లా నానాజీ, రావూరి శివ, చల్లా భూషణం, ఎం.సెంథిల్‌కుమార్ పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు చెక్కుల పంపిణీ



విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, సీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా మెరిట్ విద్యార్థులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఆత్రేయపురం మహాత్మాగాంధీ జూనియర్ కళాశాలకు చెందిన 42 మంది విద్యార్థినులకు సుమారు రూ.4 లక్షలు విలువైన చెక్కులను జేసీ తేజ్‌భరత్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సీఎస్ఆర్ ఫౌండేషన్‌కు కళాశాల కరస్పాండెంట్ సెక్రెటరీ పీఎస్ రాజు, ప్రిన్స్‌పాల్ బీవీఆర్, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

'పది'లో మంచి ఫలితాలు సాధించాలి

రాజోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని మండల ఉపాధ్యక్షుడు పాలమూరి శ్యాంబాబు అన్నారు. పొన్నమండ ఉన్నత పాఠశాలలో మంగళవారం దళిత చైతన్యవేదిక ఆధ్వర్యంలో పే బ్యాక్ టు ది సొసైటీ కార్యక్రమం నిర్వహించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 73 మంది పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్స్ అందజేశారు. ప్రధానోపాధ్యాయిని ఎం.రోహిణి, నాయకులు బత్తుల మురళీకృష్ణ, జనార్దనరావు, చిలకపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ సేవలు అభినందనీయం

రాజోలు: యాలంగి సుమిత్ రామారావు ట్రస్ట్ సేవలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. మంగళవారం రాజోలు గాంధీబొమ్మ సెంటరులో సుమిత్ రామారావు తొమ్మిదో వర్ధంతి నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు, న్యాయవాది యాలంగి రమేష్ ఆధ్వర్యంలో సుమిత్‌రామారావు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు బ్రెడ్స్, పండ్లు పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు అందజేశారు. మాజీ సొసైటీ అధ్యక్షుడు బోనం నాగేశ్వరరావు, రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ, చెవ్వాకుల సూర్యప్రకాషరావు, నల్లి మోహనరావు, తెలుగు పండిట్ మేడిద ఎలిజబెత్‌రాణి, సీవి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇమామ్ మూసయే ఖాజిమ్‌కు ఘన నివాళి



నగరంలో గుమ్మటం ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం, ఏడవ ఇమామ్ మూసయే ఖాజిమ్‌కు మంగళవారం ముస్లింలు ఘనంగా నివాళులర్పించారు. నగరంలోని మంజిలే కర్బలాలో ఈ సందర్భంగా మజ్లిస్ జరిగింది. మౌలానా మొహ్మద్ ఇబ్రహీమ్ ఇరాక్ దేశంలోని ఖాజమైన్ పట్టణంలో ఇమామ్ మూసయే ఖాజిమ్ వీర మరణం పొందిన సంఘటనలను భక్తులకు వివరించారు. మజ్లిస్ అనంతరం బార్గాహే ఫాతిమా జహేరా పంజా నుంచి గుమ్మటాన్ని తీసి నౌహా ఆలపిస్తూ, గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహిస్తూ పెద పంజీషా వరకు ఊరేగింపు నిర్వహించారు. సిరాజ్ మాజీంద్రాణి ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో ముస్లింలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

షటిల్ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న శివకుమార్

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంక మూలపోడులో జరిగిన అభ్యుదయ అంబేడ్కర్ షటిల్ టోర్నమెంట్ మండల స్థాయిలో జరిగిన టోర్నమెంట్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఏఎస్ఎం చైర్మన్ నల్లి శివకుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి బహుమతులు అందించారు. డబుల్ విన్నర్స్‌గా సుప్రీం-రాజేంద్రప్రసాద్ టీం గెలుపొందగా. రన్నర్స్‌గా చింత దొరబాబు-సీహెచ్ ఆనందరావు టీం గెలుపొందింది. తృతీయ బహుమతిని తోటే చిట్టిబాబు-నవీన్ గెలుచుకుంది. జూనియర్స్ విభాగంలో విజేతలకు కూడా బహుమతులు అందించారు. కార్యక్రమంలో షటిల్ క్లబ్ మెంబర్స్ తిరుమల బాబీ, రమణ, చింత దొరబాబు, గడ్డం రమేష్, జీసస్, పెద బుజ్జి, కలగత బాలకృష్ణ, తోటే చిట్టిబాబు, సీహెచ్ ఆనందరాజు, ఏడుకొండలు, చింత రాజేంద్రప్రసాద్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


విధి, విధానాలపై టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం



నులిపురుగుల నివారణ కార్యక్రమాలపై వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న ఎంపీడీవో మంగాదేవి

సఖినేటిపల్లి: ఈ నెల 9వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై ప్రభుత్వం రూపొందించిన విధి, విధానాలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. సదరు కార్యక్రమాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఎంపీడీవో బి.మంగాదేవి ఆవిష్కరించారు. సమావేశంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పీజే గాయత్రి మాట్లాడుతూ ఆ రోజు ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు అందరికీ ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లోను, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు, బడికి వెళ్లని పిల్లలకు కూడా ఈ మాత్రలను మింగించాలని సూచించారు. ఎంఈవో డి.కిషోర్‌కుమార్, పీహెచ్‌సీ స్టాఫ్ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, కె.గంగాధర్‌రావు, పీఎల్ఎన్ స్వామి, టి.విజయ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మున్నీసా, చంద్రలేఖ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడిగా ఇంద్రశేఖర్



అంబాజీపేట: వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడిగా గంగలకుర్రు అగ్రహారానికి చెందిన విత్తనాల ఇంద్రశేఖర్ నియమితులైనట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తెలిపారు. ఈ మేరకు ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ మిధున్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు శేఖర్‌ను మండల శాఖ అధ్యక్షుడిగా నియమించారన్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల శాఖ అధ్యక్షుడు శేఖర్ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులందరితో కలసి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

మలికిపురం: మండలంలోని అడవిపాలెం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం అయిన తాడి భవానీకి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సమకూర్చిన రూ.10 వేల నగదును మంగళవారం అందించారు. ఎమ్మెల్యే రా పాక తనయుడు వెంకట్‌రామ్, సంస్థ సభ్యులు చేతుల మీదుగా వారికి నగదు అందించారు. కార్యక్రమాలో గ్రామ పెద్దలు, సంస్థప్రతినిధులు పాల్గొన్నారు.

పి.గన్నవరం ఎస్సైగా శివకృష్ణ



పి.గన్నవరం: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్సైగా బి.శివకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మండపేట రూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతవరకూ ఇక్కడ పనిచేసిన హరికోటి శాస్త్రి మండపేట టౌన్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై శివకృష్ణకు పోలీస్ సిబ్బంది స్వాగతం పలికారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

అయినవిల్లి: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సిబ్బంది, మహిళా పోలీసులు తనకు పూర్తిగా సహకరించాలని స్థానిక ఎస్సై బి.రాజేష్‌కుమార్ అన్నారు. ఎస్సై బి.రాజేష్‌కుమార్ మంగళవారం స్థానిక పోలీస్టేషన్‌లో మహిళా పోలీసులకు అవగాహన కల్పించారు. ఎస్సై రాజేష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు గ్రామాల్లో వివాదాలకు కారణమైన, వివాదాస్పద వ్యక్తుల పేర్లు తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే గ్రామాల్లో సంచరించే అనుమానాస్పద, అపరిచిత వ్యక్తులను గుర్తించి తనకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రాజోలు తహసీల్దార్‌గా పాల్



రాజోలు: మండల తహసీల్దారుగా ఎం.పాల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం నుంచి రాజోలు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ ముక్తేశ్వరరావు పశ్చిమగోదావరి జిల్లా తణుకు వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ పాల్‌ను రెవెన్యూ సిబ్బంది స్థానిక నాయకులు కలసి అభినందనలు తెలిపారు.

వంతుల వారీగా సాగునీరు

అంబాజీపేట: ముక్కామల లాకులపై ఉన్న పంట భూములకు బుధవారం నుంచి గురువారం వరకు 24 గంటల పాటు వంతుల వారీగా సాగునీరు పంపిణీ చేయనున్నట్లు ఇరిగేషన్ శాఖ ఏఈ వి.నవీన్‌కుమార్ తెలిపారు. మోడేకుర్రు, నేదునూరు, ముక్కామల, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, కె.పెదపూడి, గంగలకుర్రు, మొసలపల్లి, సావరం గ్రామాల రైతులు పంట బోదెలను బాగు చేసుకుని సాగునీరు భూములకు అందేలా చూసుకోవాలని ఏఈ కోరారు. ఏడో తేదీ ఉదయం ఆరు నుంచి ఎనిమిదో తేదీ ఉదయం ఆరు గంటల వరకు వంతుల వారీగా సాగునీరు అందుతుందని రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రైవేటు బోట్లలో ప్రయాణాలపై ఫిర్యాదు

సఖినేటిపల్లి: అంతర్వేదిలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా గుడికి వచ్చే భక్తులను గోదావరిలో విహరింపజేస్తున్న ప్రైవేటు వ్యక్తుల పర్యాటక బోట్ల ప్రయాణాలపై చర్యలు తీసుకోవాలని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, విజయవాడలోని ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ సీఈవోకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఫ్యాక్స్ ద్వారా పంపిన ఫిర్యాదు నకళ్లను మీడియాకు అందించారు. స్టీమర్‌రేవు, ఫిషింగ్ హర్బర్ ఏరియాల్లో ఏ విధమైన అనుమతులు లేకుండా కొంత మంది పర్యాటక బోట్లను ఏర్పాటు చేసుకున్నారన్నారు. విహారయాత్ర పేరుతో లక్ష్మీనృసింహుని దర్శనానికి వచ్చే భక్తులను విజిటింగ్ కార్డుల ద్వారా ఆకర్షించి, వారిని బోట్లలో ప్రయాణించే విధంగా నమ్మిస్తున్నారన్నారు. ఈ అనధికార పర్యాటక బోట్లకు సెక్యూరిటీ నార్మ్స్ లేవని, భక్తులతో రాకపోకలు సాగిస్తున్న ఈ బోట్లు గోదావరి మధ్యలో సాంకేతిక లోపాల వల్ల ఆగిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు. అంతర్వేదిలో త్వరలో రానున్న స్వామి కల్యాణ మహోత్సవాలకు తరలి వచ్చే భక్తుల రక్షణకై తక్షణం వీటిపై ముందస్తు విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకుకోవాలని నగేష్ ఆ ఫిర్యాదులో కోరారు.

ఆర్టీసీ కార్మిక సంఘ నాయకుడు 'మాదే' మృతి



రాజోలు: ఆర్టీసీ కార్మిక సంఘ నాయకుడు మాదే కుమార్ (60) మంగళవారం మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో అమలాపురంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాజోలు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహించిన ఆయన పలు కార్మిక ఉద్యమాలతో పాటు దళితుల సమస్యలపై పోరాటం చేశారు. తన తల్లిదండ్రుల పేరిట 'మాదే' సంస్థను స్థాపించి పార్కుల్లో కూర్చునే బల్లలు, ప్రభుత్వ కార్యాలయాలకు గడియారాలు అందజేశారు. కోవిడ్ సమయంలో నిత్యావసర వస్తువులు, కాయగూరలను సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్ ఆవిష్కరణ

కొత్తపేట: యూటీఎఫ్ కొత్తపేట మండల శాఖ ఆధ్వర్యంలో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్‌ను స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. పాత పింఛన్ అమలు చేసే వారికే ఎన్నికల్లో తమ మద్దతు అని నినదించారు. పాత పింఛన్ అమలుపై రాజకీయ పార్టీలకు పోస్టు కార్డులు పంపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వై.మురళి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు టి.విజయకృష్ణ, మండల శాఖ అధ్యక్షుడు కేవీసీహెచ్ సూర్యారావు, ప్రధాన కార్యదర్శి జి.రామ్‌కుమార్ పాల్గొన్నారు.